సాక్షి అనంతపురం

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.23,100

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100 ప్రకారం ధర పలికాయి.



నిలకడగా చింతపండు ధర

హిందూపురం మార్కెట్‌లో చింతపండు ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. గురువారం కరిపులి రకం క్వింటా గరిష్టం రూ.25 వేలు, కనిష్టం రూ.8 వేలు, సరాసరి రూ.14 వేలు పలికింది.

గరిష్టం/కనిష్టం

30.1°/22.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటలకు 8 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కమ్మూరు వెల్‌నెస్ సెంటర్‌కు జాతీయస్థాయి గుర్తింపు



డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సీహెచ్‌ఓ జయ

కూడేరు: మెరుగైన వైద్య సేవలందించిన కమ్మూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. గత ఏడాది జూలై 16న జాతీయస్థాయి అధికారులు కమ్మూరు హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. సెంటర్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజలతో ఆరా తీశారు. సేవలు బాగా అందిస్తుండడంతో జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపునకు ఎంపిక చేశారు. గురువారం డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి చేతుల మీదుగా హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓ జయ జాతీయస్థాయి సర్టిఫికెట్ అందుకున్నారు. సెంటర్‌కు గుర్తింపు తెచ్చినందుకు మండల వైద్యాధికారి సౌమ్యారెడ్డి, సీహెచ్‌ఓ జయ, ఏఎన్‌ఎం మాధవి, ఆశా వర్కర్లు శ్రీదేవి, ఆదెమ్మ, మీనాక్షి, చంద్రకళను అభినందించారు.

భర్తను కడతేర్చిన భార్యకు జీవిత ఖైదు



అనంతపురం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను కడతేర్చిన కేసులో భార్యకు జీవితఖైదు విధిస్తూ అనంతపురం 7వ సెషన్స్ అడిషనల్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించింది. అనంతపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్, యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన బత్తిని సుమ కుమారికి 17 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరి కాపురం కొన్ని రోజులు సవ్యంగా జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య వివాహేతర సంబంధం గురించి తెలిసి భర్త మందలించాడు. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించేందుకు 2021 నవంబర్ రెండో తేదీ రాత్రి 7 గంటల సమయంలో రోకలి బండతో కొట్టింది. దీంతో రాజేంద్రప్రసాద్ అక్కడికక్కడే చనిపోయాడు. హతుని అన్న విజయకుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ డి.ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేశారు. అనంతపురం అడిషనల్ 7వ సెషన్స్ జడ్జి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. జడ్జి హరిత గురువారం 15 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో సుమకుమారికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. పీపీ నాగరాజ బాబు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. అప్పటి వన్‌టౌన్ సీఐ ప్రతాప్‌రెడ్డి, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎస్‌ఐ సునీల్‌కుమార్‌లు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్షపడేలా తమ వంతు కృషి చేశారు. వీరందరినీ ఎస్పీ అభినందించారు.

పనులు వేగవంతం చేయాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన్, పీఎంశ్రీ ఫేజ్–1 ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ సెక్టార్‌కు సంబంధించిన పనులపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌ఈలు, ఈఈలు, డీఈఈలు, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రధాన మంత్రి సడక్ యోజన కింద గ్రామాలకు రహదారులు నిర్మించే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంశ్రీ ఫేజ్–1 పనులకు సంబంధించి ఆటస్థలాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ గదులు, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ఆర్‌ఓ ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పనులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేస్తే త్వరితగతిన నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ జహీర్ అస్లాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్ శర్మ, ఏపీఎస్‌ఎంఐడీసీ ఈఈ శ్రీనివాసనాయుడు, ఏఎంసీ ఎస్‌ఈ చంద్రశేఖర్, పీహెచ్ ఈఈ ఆదినారాయణ, ఎస్‌ఎస్‌ఏ ఈఈ శంకరయ్య, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్ మాఫియా చెలరేగిపోతోంది. దగ్గు నివారణకు వినియోగించే సిరప్ (టానిక్)లో మత్తు కలిగించే స్వభావం కలిగిన మందును యువతకు అలవాటు చేసి.. తద్వారా విచ్చలవిడిగా విక్రయించి సొమ్ము చేసుకుంటోంది. మత్తుకు బానిసలైన ఎందరో యువకులు తమ బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కర్ణాటకలో సాగుతున్న మత్తు దందాకు అనంతపురం జిల్లాలో మూలాలు ఉన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు.

- డ్రగ్ మాఫియా పంజా
- కాసుల కోసం కక్కుర్తి
- యువత జీవితాలతో చెలగాటం
- తాడిపత్రి నుంచి రాయదుర్గానికి 'మత్తు' టానిక్‌లు
- ఇక్కడి నుంచి కర్ణాటకలోని చిత్రదుర్గకు సరఫరా
- వైద్యుల ప్రిస్క్రిప్షన్లు లేవు.. సేల్ రికార్డూ లేదు



మత్తు.. యువత చిత్తు

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గంలో యువత మత్తుకు బానిసలయ్యారు. వీరికి మత్తు కలిగించే మందు విచ్చలవిడిగా దొరుకుతుండడమే ఇందుకు కారణం. రోజురోజుకూ మత్తుకు బానిసయ్యే వారి సంఖ్య పెరుగుతుండడంతో అక్కడి పోలీసులు దీనిపై దృష్టిసారించారు. ఓ మందుల దుకాణంలో టొస్పెక్స్ 100 ఎంఎల్ అనే సిరప్‌ను యువత ఎక్కువగా తీసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ సిరప్‌ను తీవ్రమైన దగ్గు ఉన్నప్పుడు వినియోగిస్తుంటారు. అది కూడా అవసరమనుకుంటేనే వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో అరుదుగా రాస్తారు. ఎందుకంటే ఈ సిరప్‌లో మత్తు కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని డ్రగ్స్ మాఫియా అందిపుచ్చుకుని.. యువతకు మత్తు (డ్రగ్స్) కింద అలవాటు చేసినట్లు విచారణలో గుర్తించారు. రెండు సిరప్‌లు (టానిక్‌లు) తాగితే క్వార్టర్ మద్యం తాగితే వచ్చే అంత మత్తులోకి జారుకుంటారని తేలింది.

తీగలాగితే డొంక కదిలింది..

టొస్పెక్స్ టానిక్‌లు ఎక్కువగా రాయదుర్గంలోని విజయలక్ష్మి మెడికల్ షాపు నుంచి చిత్రదుర్గానికి సరఫరా అయినట్లు కర్ణాటక పోలీసుల విచారణలో వెల్లడైంది. అక్కడ తీగ లాగితే రాయదుర్గంలో డొంక కదిలింది. అక్కడి పోలీసుల నుంచి అనంతపురం డ్రగ్ అధికారులకు సమాచారం అందింది.



రాయదుర్గంలోని విజయలక్ష్మి మెడికల్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న డ్రగ్ అధికారులు (ఫైల్)

వీరి విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. కర్ణాటక పోలీసులు నిర్ధారించినట్టే రాయదుర్గంలోని విజయలక్ష్మి మెడికల్ షాపు వారు సేల్ రిజిష్టర్‌లో నమోదు చేయకుండానే 1,390 టొస్పెక్స్ టానిక్‌లు విక్రయించేశారు. వీరు తాడిపత్రిలోని పరమేశ్వర మెడికల్ ఏజెన్సీ నుంచి 1500 టొస్పెక్స్ టానిక్‌లను కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. ఏపీ, కర్ణాటకలోని రెండు మెడికల్ షాపుల నిర్వాహకులను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు.

వెలుగులోకి రానివి ఇంకెన్నో..?

కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 162 మందుల దుకాణాలు ఉన్నట్టు డ్రగ్ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అన్ని దుకాణాల్లోనూ అధికారికంగా దగ్గు నివారణ మందు టొస్పెక్స్ మత్తు టానిక్‌లు ఉంటాయి. అయితే సేల్ రిజిష్టర్లలో నమోదై విక్రయించేవి ఎన్ని? అక్రమంగా సరిహద్దులు దాటించేవి ఎన్ని..? అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కర్ణాటకలో ఈ మందుకు డిమాండ్ ఉండడంతో విజయలక్ష్మి మెడికల్ స్టోర్ తరహా వెలుగులోకి రానివి మరెన్ని ఉన్నాయో అంతుచిక్కని పరిస్థితి. డ్రగ్ అధికారులు దీనిపై నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరో షాపు సీజ్..

రాయదుర్గం పట్టణంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మూస మెడికల్ షాపును డ్రగ్ అధికారులు తాత్కలికంగా సీజ్ చేశారు. సేల్ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో పాటు ఫార్మసిస్ట్ లేకుండానే మందులు విక్రయించినట్టు తేలింది. దీంతో చర్యలు చేపట్టారు. ఈ విధానం చాలా దుకాణాల్లో కొనసాగుతున్నట్టు గుర్తించి విస్తృత తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఒక్క టొస్పెక్స్ టానిక్కే కాదు మత్తు స్వభావం కలిగే అనేక మందులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యుల చీటీ లేకుండా ఏ మందూ ఇచ్చే అధికారం లేదు. అయినా కొందరు అవేమీ పట్టనట్టు మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

జైలుకు పంపిస్తాం

మత్తు కలిగించే మందులు రిజిష్టర్‌లో నమోదు చేయకుండా విక్రయించినట్టు తనిఖీల్లో తేలితే సంబంధిత షాపు యజమానికిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి, జైలుకు పంపిస్తాం. ముఖ్యంగా ఎంబీబీఎస్ వైద్యులు రాసిచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండా సొంతంగా ఏ డ్రగ్‌నూ విక్రయించరాదు. ప్రతి మెడికల్‌షాపులోనూ ఫార్మసిస్ట్ ఉండాలి. వారి ఆధ్వర్యంలోనే మందులు విక్రయించాలి. టొస్పెక్స్ టానిక్‌లు అడ్డగోలుగా అమ్మకాలు చేపట్టినందుకు విజయలక్ష్మి మెడికల్ షాపు యజమానిని కర్ణాటక పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. తాజాగా బళ్లారి రోడ్డులోని మూస మెడికల్‌షాప్‌ను వివిధ కారణాలతో సీజ్‌చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవు.

– హనుమన్న, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం

కూలీల సంఖ్య పెంచాలి



నేమకల్లులో పనులు పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

బొమ్మనహాళ్: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ సలీంబాషా సూచించారు. మండలంలోని నేమకల్లు, లింగదహాళ్, కొలగానహళ్లి గ్రామాల్లో ఉపాధి హామీ కింద జరుగుతున్న సీసీ రోడ్లు, గోకులంషెడ్లు, అవని ప్లాంటేషన్ పండ్ల మొక్కల పెంపకం, పశువుల తొట్టె నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ నేమకల్లులో సీసీ రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్, పీఆర్ రాజ్ జేఈఈ జగదీష్, ఏపీఓ భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు బ్రహ్మయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు, మేకల మృతి



పెనకచెర్లలో పిడుగు పడి మృతి చెందిన గొర్రెలు

గార్లదిన్నె: పెనకచెర్ల గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గొర్రెలు, మేకలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రైతు చితంబరప్ప తమ గొర్రెలు, మేకలను పొలాల్లో మేపుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో గాలీవాన, ఉరుములు, మెరుపులు అధికమయ్యాయి. దీంతో వాటిని సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద చెట్టు కిందకు వదిలాడు. చితంబరప్ప గుడి వద్ద నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో 8 గొర్రెలు, 2 మేకలు మృతి చెందాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

బాబు ద్వంద్వ వైఖరిని ఎవ్వరూ నమ్మరు



నిరసన దీక్షల్లో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

- నిరసన దీక్షల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: ముస్లిం మైనార్టీల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదర్శిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎవ్వరూ నమ్మబోరని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా యూజేఏసీ (యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రిలే నిరాహారదీక్షలు చేశారు. గురువారం నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసన దీక్షలకు అనంత సంఘీభావం తెలియజేసిన అనంతరం మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల్లోనూ వైఎస్సార్‌సీపీ వ్యతిరేకంగా ఓటు వేసిందని, తమ పార్టీ లౌకికవాదానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బిల్లును సమర్థించిన టీడీపీ నాయకులు.. పార్లమెంటులో బీజేపీకి అనుకూలంగా ఉంటూ పైకి మాత్రం ముస్లింలను నమ్మించడానికి వైఎస్సార్‌సీపీ వైఖరిని తప్పుపడ్డం వారి దిగుజారుడుతనానికి నిదర్శనమన్నారు. మతోన్మాద రాజకీయాలకు దేశంలో చోటు ఉండకూడదని, టీడీపీ, జనసేన చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వక్ఫ్ సవరణ బిల్లు దేశానికి ప్రమాదకరమని, ఒక వర్గం వారిని టార్గెట్ చేసినట్లుండే బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. మేయర్ వసీం మాట్లాడుతూ ముస్లింలతో చర్చలు జరపకుండానే బిల్లును ఏకపక్షంగా తీసుకువచ్చారని, సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశం ముక్కలు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కాంగ్రెస్ నాయకుడు దాదా గాంధీ, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షులు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, జేఏసీ నాయకులు కేవీ రమణ, సాకే హరి తదితరులు వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ బీజేపీ మత రాజకీయాలను ఖండించారు. రిలే నిరాహార దీక్షలకు కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అబూజర్ నదీం, దాదు, జావీద్, ఖాజా హుస్సేన్, మునీరా, గ్రీవెన్స్ అధ్యక్షులు బాకే హబీబుల్లా, అడ్వొకేట్ రసూల్, మునిసిపల్ మాజీ చైర్మన్ నూర్‌మహ్మద్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు గోల్డ్‌బాషా, ఐఎంఎం మహబూబ్ బాషా, తాజ్, కాంగ్రెస్ నాయకులు ఇమామ్, ఎమ్మార్పీఎస్ సామ్రాట్, డాక్టర్ చంద్రశేఖర్, మధు సంఘీభావం ప్రకటించారు.

జగన్‌కు భద్రత కల్పించడంలో ఘోర వైఫల్యం

- ప్రజలను రాకుండా అడ్డుకోవడానికే పోలీసుల ప్రాధాన్యత
- అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే విధుల్లో అలసత్వం
- హెలిప్యాడ్‌కు ఎంపిక చేసిన స్థలంపై ప్రజల్లో సందేహాలు
- భద్రతను గాలికొదిలేసి విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారు
- పోలీస్ అధికారులు రాజకీయనాయకుల్లా మాట్లాడటం సరికాదు
- మంత్రి పయ్యావుల మాట్లాడినతీరు ఆశ్చర్యానికి గురి చేస్తోంది
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన వజ్రకరూరులో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి, అధికార పార్టీ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు వైఎస్ జగన్ అని, ఆయన పర్యటనకు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారని తెలిపారు. మూడు రోజుల క్రితం శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లిలో జరిగిన వైఎస్ జగన్ పర్యటనలో భద్రతా లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. భద్రత కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. జగన్‌కు భద్రత కల్పించడం కంటే పర్యటనకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకుండా పోలీసుల చేత అడ్డుకోవడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని మండిపడ్డారు. 400 కేవీ లైన్ల మధ్యలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయడంపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయన్నారు. వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన తీరు, ఎంపిక చేసిన స్థలాన్ని బట్టి చూస్తే అక్కడ ప్రజలను నియంత్రించడం సాధ్యం కాదని తెలుస్తుందని, హెలిప్యాడ్ సురక్షితమైన ప్రదేశంలో కాకుండా బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేయడం అనేక సందేహాలను లేవదీస్తోందని పేర్కొన్నారు. పాపిరెడ్డిపల్లి సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తే జగన్‌కు అసాంఘిక శక్తులు హాని తలపెట్టే ప్రమాదం కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హెలిప్యాడ్ వద్ద ఇన్‌చార్జ్‌గా ఉన్న సీనియర్ డీఎస్పీ ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరించి ప్రజలను నియంత్రించలేక చేతులెత్తేశారని ఆరోపించారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగా పోలీస్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించలేకపోయారని వెల్లడించారు. వైఎస్ జగన్ పర్యటనలో జరిగిన తప్పిదాలు, భద్రత గురించి మాట్లాడకుండా అధికార పార్టీ నాయకులు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజలన్నీ గమనిస్తున్నారని అన్నారు. పోలీస్ అధికారులు మాజీ సీఎం పట్ల పరిధి దాటి రాజకీయ నాయకుల్లా మాట్లాడటం సరికాదన్నారు.

మంత్రి పయ్యావుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాజీ సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగాను, ఒకింత ఆశ్చర్యకరంగాను ఉన్నాయని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గతంలో పోలీసుల పట్ల, పోలీస్ అధికారుల పట్ల నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం చాలామంది పోలీస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని, అనేక మంది పోలీస్ అధికారులపై కేసులు పెట్టి ఇళ్ల వద్దనే ఉండేలా చేస్తున్న విషయం మరిచారా అని మంత్రి పయ్యావులను ప్రశ్నించారు. ఉరవకొండ నియోజకవర్గంలో కూడా పోలీసుల చేత పాలన సాగించాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏదైనా వ్యాపారం చేసుకోవాలంటే మంత్రి సోదరుడు పయ్యావుల శ్రీనివాసులును కలవాలంటూ పోలీసుల చేత చెప్పిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఇలాంటి పనులు చేయడం వల్ల సమాజంలో వారికున్న గౌరవం తగ్గుతుందన్నారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, ఉరవకొండ మండల కోఆర్డినేటర్ ఓబన్న, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, యువజన నాయకుడు శశాంక్ రెడ్డి, సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, వజ్రకరూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంత రెడ్డి, సీనియర్ నాయకులు ప్యాపిలి కిష్ట, రాకెట్ల బాబు, భరత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రభుదాస్, భీమా, పట్టా ఖాజాపీరా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బరితెగింపు

- రస్తా విషయంలో తప్పుడు ఫిర్యాదు
- దళితుడిని స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు
- నిన్ను నరికితే దిక్కెవడంటూ ఖాకీల సమక్షంలోనే బెదిరింపు
- బాధితుడి ఫిర్యాదుతో 20 రోజుల తర్వాత రౌడీషీటర్‌పై కేసు నమోదు

తాడిపత్రిటౌన్(యాడికి): అధికారం మాది.. నిన్ను ముక్కలు ముక్కలుగా నరికితే దిక్కెవడంటూ ఓ దళితుడిని స్టేషన్‌లోనే బెదిరించిన టీడీపీకి చెందిన రౌడీషీటర్‌పై ఫిర్యాదు చేసిన 20 రోజుల తర్వాత యాడికి పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. యాడికి మండలం పచ్చారుమేకలపల్లికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన ఆదినారాయణపై టీడీపీకి చెందిన రౌడీషీటర్ పరిమి చరణ్ రస్తా విషయంలో గత మార్చి 19న పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పోలీసులు విచారణ నిమిత్తం ఆదినారాయణను స్టేషన్‌కు



బాధితుడు ఆదినారాయణతో ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్‌ఐ రమణ

పిలిపించారు. పోలీసుల ఎదుటే రౌడీషీటర్ రెచ్చిపోయాడు. కులం పేరుతో దూషిస్తూ 'అధికారం మాదే.. నిన్ను ఇక్కడే (పోలీస్‌స్టేషన్ ముందే) ముక్కలు ముక్కలుగా నరికితే నీకు దిక్కెవడు' అంటూ బెదిరింపులకు దిగాడు. ఈ విషయమై బాధితుడు ఆదినారాయణ పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేశాడు. అయితే ఆ రౌడీషీటర్‌పై కేసు మాత్రం నమోదు చేయలేదు. ఇదే విషయంపై ఈ నెల 4న రెండోసారి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. తనకు న్యాయం చేయాలని తాడిపత్రిలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు యాడికి పోలీసుల తీరునూ విన్నవించాడు. ఏఎస్పీ స్పందిస్తూ కేసు నమోదు చేయాలని యాడికి పోలీసులను ఆదేశించారు. అయితే సీఐ ఈరన్న, ఎస్‌ఐ రమణలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ వచ్చారని బాధితుడు ఆదినారాయణ వాపోయాడు. 20 రోజుల పాటు స్టేషన్ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో రౌడీషీటర్‌కు సహకరించే ధోరణి వీడకుంటే స్టేషన్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతానని సీఐకి తెలిపారు. దీంతో బాధితుడి నుంచి బుధవారం రాత్రి మరోసారి ఫిర్యాదు తీసుకుని రౌడీషీటర్ పరిమి చరణ్‌పై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేశారు.

నాణ్యమైన మద్యంతో ప్రజారోగ్యానికి పెద్దపీట

అనంతపురం: నాణ్యమైన మద్యాన్ని అందిస్తూ ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనంతపురం సమీపంలోని సోములదొడ్డి గ్రామంలో రూ.11.10 కోట్లతో నూతనంగా నిర్మించిన ఐఎంఎఫ్‌ఎల్ డిపో గోడౌన్‌ను మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మద్యం పాలసీని పరిశీలించి ఏపీలో నూతన పాలసీ తీసుకొచ్చామన్నారు. మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు నుంచే ప్రభుత్వానికి సుమారు రూ.1,800 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రాష్ట్ర సాధారణ పరిపాలన, పొలిటికల్, రెవెన్యూ(ఎక్సైజ్) శాఖల ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్‌మీనా మాట్లాడుతూ 2016లో ఇక్కడ బాట్లింగ్ ప్లాంట్ కాలిపోయి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.9 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఘటన తర్వాత ఇన్సూరెన్స్ క్లెయిం చేశామన్నారు. అనంతరం అధునాతన గోడౌన్ నిర్మించేలా మంత్రి ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి ప్రసాద్, జాయింట్ కమిషనర్ అనసూయదేవి, ఏపీఎస్‌బీసీ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.



ఐఎంఎఫ్‌ఎల్ డిపోను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం



జయలక్ష్మి (ఫైల్)

ఉరవకొండ: కుటుంబంలో సమస్యలు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని జగనన్న కాలిమి లే అవుట్‌లో నివాసముంటున్న వడ్డే జయలక్ష్మి (48), ధనుంజయ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, రెండేళ్ల క్రితం రెండో కుమారుడు ఆర్య.. పెనకచెర్ల డ్యాంలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. అప్పటి నుంచి జయలక్ష్మి మానసికంగా కుదేలైంది. ఈ క్రమంలో భర్త కూడా తాగుడుకు బానిస కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి పెద్దకుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాల ఎదుట క్షుద్రపూజ!



ఆత్మకూరు: స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. పాఠశాల తలుపు ఎదుట ముగ్గు వేసి పసుపు, కుంకుమ చల్లారు. అందులో నిమ్మకాయలు ఉంచారు. గురువారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు బియ్యం గింజలు, ఉప్పుతో వేసిన ముగ్గును చూడగానే భయభ్రాంతులకు లోనయ్యారు. విద్యార్థులు పాఠశాల లోనికి వెళ్లేందుకు భయపడి తమ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎవరో పాఠశాల వద్ద క్షుద్ర పూజలు చేశారని, పాఠశాలకు పిల్లలను పంపితే వారికి ఏమైనా జరుగుతుందనే భయంతో చాలా మంది తమ పిల్లలను ఇళ్లకు పిలుచుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి కారకులపై వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడి ఆత్మహత్య



భరత్ (ఫైల్)

పామిడి: స్థానిక సంత మార్కెట్ వీధిలో నివాసముంటున్న భరత్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలో ఐసీడీఎస్ పథకాల అమలు సక్రమంగా లేకపోవడంతో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమేణ పెరుగుతోంది. ఈ పరిస్థితి తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మరీ ఎక్కువగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నెలకొక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో లబ్ధిదారులకు కోటాలో కోతలు పడుతున్నాయి. దీనిపై లబ్ధిదారులను మభ్య పెడుతూ అప్పటికి సర్దిచెప్పిన అధికారులు.. ఆ తర్వాత నెలలోనూ పునరావృతం కావడంతో నోరు మెదపలేక పోతున్నారు.



పౌష్టికం.. బహుకష్టం

- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందని సరుకులు
- నెలకొక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి కోటాలో కోతలు
- జేసీ ఇలాకాలో ఇప్పటికే కందిపప్పు, వంట నూనెకు మంగళం
- తాజాగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందని వంట నూనె

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో ఐసీడీఎస్ పథకాల అమలుపై అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తోంది. నెలకొక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో లబ్ధిదారులకు అందాల్సిన కోటాలో కోతలు విధిస్తున్నారు. కొన్ని ప్రాజెక్ట్‌ల పరిధిలో ఇప్పటికే కందిపప్పు, వంట నూనెకు మంగళం పాడేశారు. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులోని తాడిపత్రి టౌన్‌తో పాటు తాడిపత్రి, పెద్దపప్పూరు, శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఏప్రిల్ నెల కోటా కింద అందజేయాల్సిన అర కిలో వంటనూనె ప్యాకెట్లకు అధికారులు మంగళం పాడారు. ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు మూడు కిలోల బియ్యం, కిలో కంది బేడలు, అర కిలో వంట నూనె, మొదటి విడతగా 13 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాల సంజీవిని కిట్‌ను కలిపి అందజేయాల్సి ఉంది. ప్రీస్కూల్ పిల్లల వంట కోసం కిలో వంట నూనె ప్యాకెట్లను సరఫరా చేస్తారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించి అర కిలో వంట నూనె ప్యాకెట్లు రాకపోవడంతో మిగిలిన సరుకుల పంపిణీలోనూ అధికారులు నిర్లక్ష్యం వహించారు.

గతంలో కంది బేడలు.. ఇప్పుడు వంట నూనె

ప్రతి నెల మొదటి వారంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం పూర్తవుతుంది. కానీ రెండవ వారం వచ్చినా పలు కేంద్రాలకు పంపిణీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుత్తి, యాడికి స్టాక్ పాయింట్ల పరిధిలో ఉన్న తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు, యాడికి మండలాలకు అరకిలో చొప్పున నూనె ప్యాకెట్లు వచ్చాయి. కానీ తాడిపత్రి స్టాక్ పాయింట్ పరిధిలో ఉన్న తాడిపత్రి టౌన్, తాడిపత్రి, పెద్దపప్పూరు, యల్లనూరు, పుట్లూరు మండలాలకు మాత్రం వంట నూనె ప్యాకెట్ల పంపిణీలో కోత విధించారు. తాడిపత్రి పట్టణంలో 66 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా నూనె ప్యాకెట్లు 1,391, తాడిపత్రి మండలంలో 65 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 924, పెద్దపప్పూరు మండలంలో 52 అంగన్‌వాడీ కేంద్రాలకు 420, యల్లనూరు మండలంలో 46 అంగన్‌వాడీ కేంద్రాలకు 622, పుట్లూరు మండలంలో 49 అంగన్‌వాడీ కేంద్రాలకు 551 అందాల్సి ఉంది. గతంలో కంది బేడల ప్యాకెట్ల పంపిణీలోనూ జాప్యం చోటు చేసుకుని చివరకు కోటా ఎత్తివేయడం వంటి సంఘటనలు జరిగాయి.

నానాటికీ పెరుగుతున్న రక్తహీనత బాధితుల సంఖ్య

తాడిపత్రి ప్రాజెక్ట్ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారుల, బాలింతలు, గర్భిణుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సాధారణంగా శరీరంలోని ఎర్ర రక్త కణాల సంఖ్య లేదా వాటిలోని హిమోగ్లోబిన్ సాంద్రత సాధారణం కంటే తక్కువగా ఉంటే రక్తహీనతగా పరిగణిస్తారు. హిమోగ్లోబిన్ స్థాయి మగవారిలో 13 నుంచి 14.2 గ్రా/డీఎల్ (డెసిలీటర్), మహిళల్లో 11.6 నుంచి 12.3 గ్రా/డీఎల్ ఉండాలి. అంతకంటే తక్కువగా ఉన్న వారిని రక్తహీనతతో బాధపడుతున్నట్లుగా నిర్ధారించి, సత్వర పౌష్టికాహారం అందజేయాల్సి ఉంటుంది. లేకుంటే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముంటుంది.

నూనె ప్యాకెట్లు రాలేదు

అంగన్‌వాడీ కేంద్రాలకు అరకిలో నూనె ప్యాకెట్ల సరఫరా జరగలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే డీలర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన వివిధ రకాల సరుకులను పంపిణీ చేయించాం.

– శంకరయ్య, డిప్యూటీ తహసీల్దార్, తాడిపత్రి

స్టాకిస్టుతో మాట్లాడుతా

అంగన్‌వాడీ సెంటర్లకు అరకిలో చొప్పున నూనె ప్యాకెట్ల సరఫరాపై టీచర్ల నుంచి వివరాలను తీసుకుంటాం. పంపిణీ ఎందుకు జరగలేదో స్టాకిస్టును అడిగి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. అర కిలో నూనె ప్యాకెట్ల గురించి ఎదురు చూడకుండా మిగిలిన సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశిస్తాం.

– సాజిదాబేగం, సీడీపీఓ, తాడిపత్రి

తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో రక్తహీనత బాధితుల సంఖ్య

గర్భిణుల సంఖ్య	1,629 మంది
7 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	15 మంది
10 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	231 మంది
11 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	350 మంది
బాలింతల సంఖ్య	1,904 మంది
7 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	11 మంది
10 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	302 మంది
11 గ్రా/డీఎల్ లోపు బాధితుల సంఖ్య	340 మంది
6 నెలల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారుల సంఖ్య	16,407 మంది
రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య	1000 మందికి పైగా

కలెక్షన్ సెంటర్లను వినియోగించుకోండి



కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పూర్ణచంద్రరావు

శింగనమల: రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) నిధులతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కలెక్షన్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఇక్రిసాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం, శింగనమల గ్రామాల్లో దొనరామేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నిర్మించిన కలెక్షన్ సెంటర్లను థర్డ్ పార్టీ వెరిఫికేషన్ కింద గురువారం ఆయన పరిశీలించారు. రైతు సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ఎఫ్‌పీఓ గ్రూప్ పరిధిలోని గ్రామాలు, సభ్యుల వివరాలు, పండించే ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆరా తీశారు. పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసుకుని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్లు దోహదపడతాయన్నారు. పంట కోత అనంతరం ఉత్పత్తులను మార్కెట్‌లో డిమాండ్ వచ్చే వరకూ నిల్వ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామచంద్ర, ఉద్యానాధికారి శైలజ, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉమాదేవి, అనూష, పవన్‌కుమార్, అమరేష్, రైతులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ – వృద్ధురాలికి తీవ్రగాయాలు



గాయపడిన లక్ష్మీదేవి

యాడికి: మండలంలోని చందన రైల్వే గేట్ సమీపంలో టిప్పర్ ఢీకొని ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. చిక్కేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి పనిపై గురువారం ఉదయం కేశవరాయుని పేటకు వెళ్లింది. అక్కడ పని ముగించుకుని తిరుగు ప్రయాణమైన ఆమె చందన రైల్వే గేట్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా తాడిపత్రి నుంచి చందన మీదుగా డోన్‌కు వెళుతున్న ఇసుక టిప్పర్ ఢీ కొంది. ఘటనతో ఆమె శరీరం నుంచి చెయ్యి వేరైంది. విషయం తెలుసుకున్న కుమారుడు భాస్కరరెడ్డి వెంటనే ఆమెను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై యాడికి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హామీల అమలుపై పోరాడండి

- ఎమ్మెల్యే కాలవకు తలారి రంగయ్య హితవు
- లింగమయ్య హత్యపై ఓ బీసీగా స్పందించక పోవడం సిగ్గుచేటు



అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొందరు మహిళలు హత్యకు గురయ్యారంటూ కల్లిబొల్లి ఏడుపులతో ప్రజలను పక్కదోవ పట్టించి పోరాటాలు సాగిస్తామంటూ గొప్పలకు పోయిన ప్రస్తుత రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు... ఇటీవల పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య హత్యకు గురైతే కనీసం పెదవి కూడా విప్పలేకపోయారని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య మండిపడ్డారు. బీసీగా పుట్టినందుకు కాలవ నిజంగా సిగ్గుపడాలన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కాలవ చేసిన ఆరోపణలను ఖండించారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌ను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విమర్శించారంటూ నానా యాగీ చేసిన కాలవ.. అక్రమాల పుట్టగా నిలిచిన సుధాకర్ యాదవ్‌కు మద్దతుగా రాజకీయ యుద్ధం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాలవకు చేతనైతే సూపర్ సిక్స్ హామీలతో పాటు జిల్లా ప్రయోజనాలకు సంబంధించి బీటీపీ, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై బీసీలందరినీ సమీకరించి యుద్ధం చేయాలన్నారు. కేంద్రంలోని కూటమి ప్రభుత్వంతో అంటగాగుతున్న టీడీపీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాజకీయ యుద్ధం చేస్తే బాగుంటుందన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఆరోపణలు చేస్తున్నారని, తాను ఖర్చు చేసిన నిధులపై వీలైతే విచారణ చేసుకోవాలని సవాల్ విసిరారు.


రేపు కూడేరులో రథోత్సవం



ఉత్సవానికి నూతనంగా సిద్ధం చేసిన రథం

కూడేరు: ప్రఖ్యాతిగాంచిన పార్వతీపరమేశ్వర స్వయంభు జోడులింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. భక్తుల సంకల్పం.. ఆదిదేవుడి అనుగ్రహంతో చాలా తక్కువ సమయంలోనే ఉరవకొండకు చెందిన ఆచార్యులు రాజశేఖర్, చరణ్ నైపుణ్యంతో కూడేరు సంగమేశ్వరుడి నూతన రథం పనులు పూర్తయ్యాయి. కాగా, పాత రథం శిథిలమై పోవడంతో నూతన రథం తయారీకి తొలుత ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన కోకా బాబూ వరప్రసాద్ సోదరులు ముందుకు వచ్చారు. దాదాపు రూ.20 లక్షలు వెచ్చించి టేకు, మద్దిచెక్క సామగ్రిని తెప్పించి, ఈ ఏడాది జనవరి 26న రాజశేఖరాచారి, చరణ్ ఆచారికి పనులు అప్పగించారు. కూడేరు గ్రామస్తులు కుమ్మర వెంకటరాముడు, కుశాల నాగరాజుతో పాటు మరికొందరి సహకారంతో ఈ నెల 12న జరిగే రథోత్సవానికి ఎలాగైనా రథం సిద్ధం చేయాలనే సంకల్పంతో రేయింబవళ్లు పనులు చేపట్టి నిర్దేశిత సమయానికి రథాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. రథం పనులు సాగుతుండగా గమనించిన కొందరు భక్తులు సైతం రూ.10 వేల నుంచి రూ.లక్షల్లో విరాళాలు అందజేశారు. గురువారం రథాన్ని కొంత దూరం లాగి పరీక్షించారు. ఎలాంటి లోపాలు వ్యక్తం కాకపోవడంతో దాతలు కుశాలు నాగరాజు, బాబూ వరప్రసాద్‌కు గ్రామస్తులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ రైడర్ దుర్మరణం



మహేష్‌కుమార్ (ఫైల్)

పెద్దవడుగూరు: వాహనం ఢీకొన్న ఘటనలో బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరులోని హెబ్బాల్‌లో వినాయక్‌నగర్ ఫోర్త్‌క్రాస్‌లో నివాసముంటున్న మహేష్‌కుమార్ (47)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. బైక్ రైడింగ్‌పై ఆసక్తి ఉన్న ఆయన వారం రోజుల క్రితం తన స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనాలపై సిక్కింకు వెళ్లారు. ఈ క్రమంలో తిరుగు ప్రయాణమై ఈ నెల 9న హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలిపారు. బుధవారం వేకువజామున హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఒంటరిగా ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన గురువారం ఉదయం పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై ఎస్‌ఐ ఆంజనేయులు దర్యాప్తు చేపట్టారు.

కుప్పకూలి యువకుడి మృతి

గుత్తి: మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన సూరి పోగుల శివశంకర్ (36) గురువారం ఉదయం కుప్పకూలి మృతి చెందాడు. మిద్దె పైకి చౌడు మోస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పెనుగాలులకు నేలకొరిగిన అరటి



విరిగిపడిన అరటి చెట్లను చూపుతున్న కౌలు రైతు ఎర్రిస్వామి

కూడేరు: మండలంలోని మరుట్ల–1వ కాలనీలో గురువారం పెనుగాలుల ధాటికి కౌలు రైతు బెస్త ఎర్రిస్వామి సాగు చేసిన అరటి చెట్లు విరిగిపడ్డాయి. కోత దశలో ఉన్న దాదాపు 1500 అరటి చెట్లు విరిగిపోవడంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

'బార్లను తలపిస్తున్న మద్యం షాపులు'

గుంతకల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లా అంతట మద్యం షాపులు బార్లను తలపిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం దుకాణాలు నిర్దేశిత సమయాల్లోనే తెరవాలని, బెల్టుషాపులు పెట్టకూడదని, ఎంఆర్‌పీకే విక్రయాలు చేపట్టాలనే నిబంధలు ఉన్నాయన్నారు. ఈ నిబంధనలను ప్రభుత్వమే తుంగలో తొక్కి మద్యం విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ మద్యాన్ని ఏరులై ప్రవహింపజేస్తోందని మండిపడ్డారు.

ఎకరాకు 70 బస్తాల దిగుబడి!



మొక్కజొన్న బస్తాలతో రైతు సంజీవరెడ్డి

గుమ్మఘట్ట: కరువు జిల్లాలో ఓ రైతు తనకున్న రెండు ఎకరాల్లో పంటల సాగు చేపట్టి అద్భుతాలను సృష్టించాడు. వివరాలు.. రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రైతు సంజీవరెడ్డిది సాధారణ మధ్య తరగతి కుటుంబం. తనకున్న రెండు ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రకృతి వైపరీత్యాలు, కరువుల నేపథ్యంలో అందరు రైతుల మాదిరిగానే పంట నష్టాలను చవిచూస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పంటల సాగుపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకున్న ఆయన... గత ఏడాది డిసెంబర్‌లో మొక్కజొన్న పంట సాగు చేపట్టి మొత్తం రెండు ఎకరాల్లో 140 బస్తాల దిగుబడిని సాధించాడు. విషయం తెలియగానే చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు పెద్ద సంఖ్యలో రైతు వద్దకు చేరుకుని పంట సాగు విధానాలపై ఆరా తీశారు. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల నుంచి 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందని, అదే వేసవి సీజన్ పంట అయితే 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా ఏకంగా ఎకరాకు 70 బస్తాల దిగుబడి ఎలా సాధ్యమైందంటూ ప్రశ్నించారు.

సేంద్రియ సాగుతో అద్భుతం

పంట మార్పిడితో పాటు సేంద్రియ పద్ధతుల్లో పంట సాగు చేపట్టడమే తన ఈ విజయానికి కారణంగా రైతులకు సంజీవరెడ్డి వివరించాడు. .ఎకరా విస్తీర్ణంలో పెన్నా రకం మొక్కజొన్న విత్తు మొదలు పంట కోత పూర్తయ్యే వరకు రూ.35 వేలు ఖర్చయినట్లు తెలిపాడు. అంతే కాకుండా పంటకు పంటకు మధ్య నేలకు కాస్త విరామం ఇవ్వడం ద్వారా భూమి కోల్పోయిన సారం తిరిగి పుంజుకునేందుకు మార్గం ఏర్పడిందన్నారు. దీనికి తోడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధ్యమైందన్నారు. స్థానికంగా క్వింటా రూ.2,310తో అమ్మితే రూ.1,94 లక్షలు రాగా, రెండు ఎకరాలకు పెట్టుబడి కింద రూ.70 వేలు పోను రూ.1,24 లక్షల నికర ఆదాయం సమకూరిందని వివరించారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



ఐఓసీ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి, గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: గ్రామాభివృద్ధికి అన్ని విధాల అండగా ఉంటామని మాట ఇచ్చిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అధికారులు.. డిపో ఏర్పాటైన తర్వాత మాట మార్చడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నక్కనదొడ్డి సర్పంచ్ వరలక్ష్మితో కలసి గ్రామస్తులు స్థానిక ఐఓసీ డిపో ఎదుట ధర్నాకు దిగారు. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామ సమీపంలో ఐఓసీ డిపో ఏర్పాటు సమయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఐఓసీ అధికారులు హామీ ఇచ్చారని ఈ సందర్భంగా సర్పంచ్, ఆమె భర్త బొజ్జానాయక్ గుర్తు చేశారు. ఇప్పటికి నాలుగేళ్లు పూర్తవుతున్నా... ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఓసీ నిర్మాణం కారణంగా పంచాయతీ పరిధిలోని నరసాపురం గ్రామంలో వర్షపు నీరు బయటకు వెళ్లడానికి వీలు లేకుండా పోయిందని, దీని వల్ల గ్రామంలోని పలు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించి వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు పైనే తాగాలి.. ఆపై ఊగాలి!

తాడిపత్రి టౌన్: నియోజకవర్గ కేంద్రం తాడిపత్రిలో మందుబాబుల ఆగడాలు నానాటికీ శ్రుతి మించి పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపుల్లోనే అమ్ముతున్న గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేసి నడిరోడ్డుపైనే పట్టపగలు తాగుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే... 'ఇది తాడిపత్రి.. ఇక్కడ ఇలాగే ఉంటుంది' అని జవాబిస్తుండడంతో ప్రశ్నించిన వారు కంగు తింటున్నారు. మద్యం షాపులన్నీ టీడీపీకి చెందిన నాయకులవే కావడంతో అధికారులు, పోలీసులు సైతం అటుగా చూసేందుకు వెనుకంజ వేస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి.







పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం వద్ద రోడ్డు పైనే తాగుతున్న మందు బాబులు

జాడలేని ఆహార సలహా సంఘాలు



- రేషన్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో జరుగుతున్న మోసాలు
- పట్టించుకోని అధికారులు

రాప్తాడు: రేషన్ షాపుల్లో అక్రమాలు జరగకుండా చూడటంతో పాటు నిరుపేదలకు సక్రమంగా రేషన్ అందేలా ఆహార సలహా సంఘాలు పర్యవేక్షించేవి. గతంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించే సంఘాలు నేడు ఎక్కడా కానరావడం లేదు. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా తుకాల్లో మోసాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై.. మండల పరిధిలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణ, రేషన్ పంపిణీ, సరుకుల నాణ్యత, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. రాప్తాడు నియోజకవర్గంలో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 255 రేషన్ షాపులు ఉన్నాయి. ఆయా మండలాల్లో దాదాపుగా 1,05,608 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సభ్యులు సమావేశమై.. ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. అయితే నేడు పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది.

ప్రశ్నార్థకంగా నాణ్యత

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథులు కరువయ్యారు. రేషన్ షాపుల్లో తూకాల్లో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను కొన్ని చోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. లోటుపాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షించడం జరిగేది. సమస్యలను పరిష్కరించే వారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– లక్ష్మీనారాయణ, మాజీ స్టోర్ డీలర్, పాలబావి

నియోజకవర్గంలో రేషన్‌కార్డుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	కార్డుల సంఖ్య
రాప్తాడు	32	12,579
ఆత్మకూరు	34	12,362
అనంతపురం రూరల్	77	41,507
రామగిరి	32	11,006
కనగానపల్లి	34	13,530
చెన్నేకొత్తపల్లి	46	14,624

త్వరలోనే సంఘాలను నియమిస్తాం



ప్రభుత్వ చౌకదుకాణాల పరిధిలో ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఈ మేరకు ప్రతి చౌక దుకాణాల పరిధిలో త్వరలోనే సంఘాలను ఏర్పాటు చేస్తాం. కార్డుదారులకు ఎవరికైనా డీలర్లు తక్కువగా బియ్యం ఇస్తున్నారని తమకు ఫిర్యాదు చేస్తే ఆ డీలర్‌పై చర్యలు తీసుకుంటాం. బియ్యం తక్కువగా ఇస్తున్నారని మాకు కార్డుదారులు ఫిర్యాదు చేయలేదు. డీలర్లు కార్డుదారులకు తక్కువగా బియ్యం ఇస్తే ఉపేక్షించం. కార్డుదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ రక్షక్ ప్రీ–ప్రైమరీ స్కూల్ మూడో వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు పాత్ర కీలకమన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ఇక్కడ మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతోందన్నారు. ఆర్డీటీ సహకారంతో స్పానిష్ లాంగ్వేజ్ కూడా అదనంగా పిల్లలకు నేర్పిస్తున్నట్లు వెల్లడించారు. వంద సెట్ల ప్రకారం డిజిటల్ ప్లేట్స్, క్రేయన్స్, పెన్సిల్స్, పెన్స్, నోట్ బుక్స్ వితరణ చేసిన డిస్కవరీ అనంతపురం సంస్థ నిర్వాహకుడు అనిల్‌ను అభినందించారు.

మద్యం ప్రియుల జేబుకు చిల్లు

- ఆత్మకూరులో అధిక ధరలకు మద్యం విక్రయాలు
- బాటిల్‌పై రూ.10 అదనంగా వసూళ్లు!
- గ్రామాల్లో భారీగా వెలుస్తున్న బెల్టు షాపులు
- నిద్ర వీడని ఎక్సైజ్ అధికారులు



ఆత్మకూరు: అధికారం మాది.. మమ్మల్ని ఆపేది ఎవరు? అంతా మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం అంటూ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. మండల కేంద్రంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఆత్మకూరు మండలానికి మూడు మద్యం దుకాణాలు మంజూరు కాగా.. టెండర్ల ద్వారా కేటాయించారు. టెండర్లు దక్కించుకున్నది ఒకరైతే వారి ద్వారా టీడీపీ నేతలు ఆ టెండర్లను కైవసం చేసుకున్నారు. ఆత్మకూరులో రెండు మద్యం దుకాణాలు, సనప గ్రామంలో ఒక మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పెద్ద ఎత్తున బెల్టుషాపులు వెలుస్తున్నాయి. కొంత మంది నేరుగా మద్యం దుకాణాల్లోనే మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాటిల్‌పై అదనంగా వసూలు

ప్రభుత్వం పెంచిన ధరలకు కాకుండా మద్యం దుకాణాల్లో ప్రతి బాటిల్‌పై అధనంగా రూ.10 వసూలు చేస్తున్నట్లు మద్యం ప్రియులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించాలని చెబుతున్నా.. మండల కేంద్రంలో నిబంధనలు ఉల్లంఘించి ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. సగటున ఒక రోజుకు ఒక షాపు నుంచి దాదాపు రూ.5 వేల వరకు అదనంగా ఆర్జిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉదయం 5 గంటలకే మద్యం విక్రయాలు

అత్యవసర సమయంలో వైద్యం అయినా దొరుకుతుందో లేదా తెలియదు కానీ.. ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఉదయం 5 గంటల నుంచి మద్యం దొరుకుతోంది. ప్రతి గ్రామంలో టీడీపీకి సానుకూలంగా ఉన్న వారే బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మద్యం దుకాణాల నుంచి ఓ ఆటోలో నేరుగా మద్యం కేసులను బెల్టు షాపులకు పంపుతున్నట్లు సమాచారం.

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఉన్నాయని తెలిసినా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా ప్రతి మద్యం దుకాణం నుంచి నెలకు ఇంత అని వారికి మామూళ్లు కూడా వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరులో ఓ మద్యం దుకాణానికి దగ్గరగా ఓ ప్రైవేటు పాఠశాల, పక్కన మసీదు ఉన్నాయి. అంతేకాకుండా ఆ దుకాణం నడి రోడ్డులో ఉండటంతో మద్యం కొనుగోలు చేడానికి వచ్చిన వారు వాహనాలను రోడ్డుపై నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. చుట్టు పక్కన ఇళ్లు కూడా ఉండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలి అంటూ మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

‘సూపర్ సిక్స్’ అమలు చేయాల్సిందే



ప్రసంగిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: ‘అధికారంలోకి వచ్చేందుకు హామీలిచ్చి ఓట్లు దండుకున్నావు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కావు. అప్పులు ఉనాయని తెలుసు.. ఆ విషయమూ నీవే చెబుతూనే సూపర్ సిక్స్ హామీలు ఇచ్చావు. ఇప్పుడు హామీలు అమలు చేసేందుకు డబ్బులు లేవంటూ మోసం చేస్తున్నావు’ అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై అఖిల భారత రైతు కూలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాసీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ ద్వారా భూగర్భ జలాలు పడిపోతాయనే విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. కుప్పంకు నీరు తీసుకెళ్లేందుకు అనంతపురం జిల్లా రైతులకు ఉరివేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాలువ వెడల్పు కోస విడుదల చేసిన జీఓలను రద్దు చేయడంతో పాటు లైనింగ్ పనులు ఆపాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి క్రిష్ణ, కోశాధికారి రాయుడు, సభ్యులు రామాంజనేయులు, తరిమెల రామాంజనేయులు, మర్తాడు శివయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏసురత్న, పట్టణ పేదల సంఘం వీరనారప్ప, చంద్రుడు, పీడీఎస్‌యూ శంకర్, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దస్తగిరి స్వామి ఉరుసు



అలంకరణలో దస్తగిరి స్వామి దర్గా



ఇమామ్‌వలి సమాధి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో వెలిసిన దస్తగిరి స్వామి (ఇమామ్‌వలి) దర్గా భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. కులమతాలకు అతీతంగా దస్తగిరి స్వామిని కొలుస్తారు. వందేళ్ల కిందట ఏర్పాటైన ఇక్కడి దస్తగిరి స్వామిని ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈనెల 12, 13 తేదీల్లో ఉరుసు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. 12న గంధం పూజ ఉంటుంది. ఈ సందర్భంగా గంధాన్ని గ్రామ వీధుల్లో పల్లకీలో ఊరేగిస్తారు. 13న ఉరుసు ఉంటుంది. భక్తితో కొలిచే వారికి తప్పక కోర్కెలు తీరుతాయనే నమ్మకం చాలామందిలో ప్రగాఢంగా ఉంది. ఉరుసు ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు అనంతపురం నగరం నుంచి భక్తులు తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఈనెల 12, 13 తేదీల్లో జరగనున్న దర్గా ఉరుసు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దస్తగిరి స్వామిని హిందూ, ముస్లింలు అత్యంత భక్తితో కొలుస్తారు. 13న ఉరుసు సందర్భంగా రాత్రి పంచరత్నావళి అనే నాటక ప్రదర్శన ఉంటుంది.

– హజరత్ షేక్ హజీ గపూర్ సాహెబ్, దర్గా మేనేజర్

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

గార్లదిన్నె: పంటలకు భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని అనంతపురం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో భూసార పరీక్ష, మట్టి నమునాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో అరుతడి పంటలకు మూడు సంవత్సరాలకు ఒకసారి, నీటి వసతి ఉండే పొలాల్లో మూడు పంటలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కావాల్సిన మోతాదు కన్నా అధికంగా వాడటం వల్ల చీడ, పీడ సమస్యలు వచ్చి, భూమి నిస్సారవంతమై దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, వీహెచ్‌ఏ గుల్బరేష, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ సాధనకు చైతన్య యాత్ర

- ఐద్వా, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ సామాజిక న్యాయం సాధనకు శుక్రవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సామాజిక చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి మాట్లాడారు. జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11న జిల్లా పరిషత్ హాల్ నుంచి చైతన్యయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సభకు ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. దళిత, గిరిజన కాలనీల్లో సదుపాయాల కల్పన, భూమిలేని వారికి కనీస మూడు ఎకరాల సాగు భూమి ఇవ్వాలి, ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వమే నిర్వహించాలి. ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి. సంక్షేమ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో చైతన్య యాత్ర సాగుతుందన్నారు. 14 తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ నగర్ నాగుల కట్ట సమీపంలోని ఉన్నత పాఠశాల వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, నాయకులు వెంకటేష్, జీవ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, గిరి, బాలిక విభాగం కన్వీనర్ రజిత, ఐద్వా నాయకురాళ్లు చంద్రిక, శ్యామలమ్మ, అశ్విని పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాములోరి గరుడ విహారం



మహావిష్ణు అలంకారంలో దర్శనమిచ్చిన కోదండ రాముడు

అనంతపురం కల్చరల్: శ్రీశైల క్షేత్రాన్ని తలపిస్తూ నగరంలోని మొదటి రోడ్డు కోదండ రామాలయంలో సాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు భక్తిభావాన్ని నింపుతున్నాయి. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హోమాలు, సహస్ర నామార్చనలు నేత్రానందంగా సాగుతున్నాయి. గురువారం సాయంత్రం సీతారాములు శ్రీమహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రెండవ రోడ్డు, మూడవ రోడ్డుల మీదుగా ఆలయం చేరుకున్న వాహన సేవలకు భక్తులు భక్తినీరాజనాలర్పించారు. అంతకు ముందు ఆలయంలో మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, భక్తమండలి సభ్యులు నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, జీజే వేణు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల అందజేత



విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలకు గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామాంజనేయులు మాట్లాడుతూ.. ఆత్మకూరు కేజీబీవీలో చదువుతున్న ఓ విద్యార్థికి వినికిడి పపరికరం, పి.యాలేరులో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థికి వినికిడి పరికరం, వడ్డుపల్లి గ్రామానికి చెందిన ఐదవ తరగతి విద్యార్థికి బోధనోపకరణాల కిట్టు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మధుసూదన్, ఐఈఆర్‌టీ అరుణ, షరీఫా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నియంత్రణ



గర్భిణులకు సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ లావణ్య

ఆత్మకూరు: గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. పౌష్టికాహారంతో రక్తహీనతను నియంత్రించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. గురువారం మండలంలోని ముట్టాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వేడుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా పిల్లలకు తల్లిపాలే తాపించాలన్నారు. తల్లులకు ముర్రుపాల ఆవశ్యకతను వివరించారు. గర్భవతిగా పేరు నమోదు అయినప్పటి నుంచి పిల్లలకు రెండు సంవత్సరాలు వచ్చే వరకూ వెయ్యి రోజుల సంరక్షణను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. జైన్ శోభాయాత్ర



నగర వీధుల్లో జైనుల సందడి

అనంతపురం కల్చరల్: జైనుల ఆరాధ్య దైవం వర్ధమాన మహావీర్ జయంతి గురువారం ఘనంగా జరిగింది. పాతూరులోని వాసుపూజ్య స్వామి ఆలయం ప్రత్యేక పూజలతో కళకళలాడింది. ఉదయం పాతూరు నుంచి నగరవీధుల్లో వెండి రథంలో ఉత్సవ మూర్తికి శోభాయాత్ర నిర్వహించారు. పతాకాలతో రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో జైన్ భక్తులు సందడి చేశారు. మహావీర్ స్వామి జన్మ కల్యాణ్ పేరిట సాగిన సంప్రదాయ వేడుకల్లో భాగంగా స్వామివారి ఆలయంలో సామూహిక భజనలు, తీర్థప్రసాద వితరణ జరిగింది. ప్రధాన అర్చకుడు సుభాష్ జైన్ మహావీర్ జయంతి విశేషాలను తెలియజేశారు. జైన్ మందిరాల ప్రతినిధి వసంత కుమార్ జైన్ మాట్లాడుతూ.. అహింసే పరమధర్మమని చాటిన ప్రవక్త వర్ధమాన మహావీర్ ఆశయాలను పాటించడానికి జైనులు ఇతోధికంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే కమలానగర్‌లోని వాసుపూజ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

నేడు నానో కారు వేలం

అనంతపురం: అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నానో కారు వేలం వేస్తున్నట్లు సీఐ కే.శాంతి లాల్ తెలిపారు. ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఏపీ10ఏడబ్ల్యూ1622 నానో కారు కోసం ఆసక్తి గల వారు రూ.1150 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం ముగిసిన తరువాత వేలం దక్కని వారికి రూ.1,150 డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం: అనంతపురం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2,000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలం దక్కకపోతే రూ.2,000 డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు.

చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎంపీపీ సుబ్బర హేమలత



ఆత్మకూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, జిల్లా ఎంపీపీల సంఘం కో–కన్వీనర్ సుబ్బర హేమలత డిమాండ్ చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐ–టీడీపీ ప్యాక్ కార్యకర్తలు సోషల్ మీడియాలో మహిళలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా కనీసం వారిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. గతంలో ఓ మహిళ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తనకు ఇంటి పట్టా వచ్చిందన్న ఆనందంతో సంతోషపడిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకుంటే ఆమెపై పోస్టులు పెట్టి వేధించారన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకునేలా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ నాన్ బెయిలబుల్ కేసులు బనాయించారని తెలిపారు. వైఎస్ భారతిని దూషిస్తే కేవలం కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెగ్యులర్ చేయాలని వినతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని టైం స్కేలు ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పర్యటించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి పలు ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. గత 30 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో టైం స్కేలు ఉద్యోగులుగా పని చేస్తున్నామని తెలిపారు. మా ఉద్యోగాలు రెగ్యులర్ చేసి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టైం స్కేలు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ నాయుడు, సంజీవులు, నీలకంఠ, బి.శివయ్య, హనుమంతు నారాయణ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మదర్ థెరిస్సా కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని మదర్ థెరిస్సా కాలనీలో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలంటే పిల్లల తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇప్పటికే షార్ట్ సర్క్యూట్ అవుతూ నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయి. వర్షకాలంలో సమస్య మరింత జటిలంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులు, విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.